# నవ్వు తెచ్చిన తంటా!

నవ్వునాలుగు విధాల చేటు అనేది పాత సామెత! ఇప్పుడు నవ్వక పోవటం ఒక రోగం ఒక సినీ దర్శకుని ఉవాచ! నేడు ఎక్కడ చూచినా కామెడీ క్లబ్బులే!

నవ్వన్నా... లవ్ అన్నా యిష్టపడని వారుండరు! అన్ని సమయాల్లోనూ నవ్వటం మంచిది కాదు. చనిపోయిన వారిని చూచి నవ్వు మంచిదేకదాని నవ్వలేం సరి కదా... కూడదు?

స్త్రీలకు నవ్వాకపెట్టని ఆభరణం! మగాళ్లు 'రేర్'గా నవ్వుతారు. లిమిటెడ్‌గా అప్పుడప్పుడు నవ్వుతారు. సినీమా హాస్యనటుల్లా... నిజజీవితంలో విరగబడి... పగలబడి నవ్వటం కద్దు! మగాడి నవ్వు కృతకం!

పెదాలపై చిరుమందహాసం స్త్రీల సొత్తు! ఏడు వారాల నగలే కాదండోయ్... నవ్వు మహిళలకు ఎనిమిదో ఆభరణం! అంతమాత్రాన అతిగ నవ్వితే వెకిలిగా వుంటుంది.

ఆడవారి అరనవ్వులో అందం మహోత్కృష్టమైనది! అన్నట్టు... నవ్వటంలో నావైఫ్ నెంబర్‌వన్! నవ్వుల పోటీల్లో (ముగ్గుల పోటీల్లాగా) అనేక సార్లు బహుమతలు దక్కించుకుంది. వారం రోజుల పాటు ఏకధాటిగ నవ్వేసి రికార్డ్ స్థాపించి గిన్నీస్ బుక్కులోకెక్కి ప్రపంచ దృష్టిని తనవైపుకు మళ్లించుకుంది! రాష్ట్ర ప్రభుత్వం నవ్వుల రాణి బిరుదు శ్రీమతికి ప్రధానం చేసి ఘనంగా సత్కరించింది.

నా పెళ్లానికున్న పాపులారిటీ అది!

నా మటుక్కు నాకు... నవ్వన్నా... నవ్వేవారన్నా... అసహ్యం... ఏవగింపు. నేను అన్ని వేళలా సీరియస్‌గానే వుంటాను. అది నాతలరాతో... అలవాటో ఎవరేమనుకున్నా లెక్క చేయను. నాతరహానే అంత!

అట్ల పెనంలా మొహం మటమటలాడుతూంటుంది. ఏడ్వకురా వెధవా?... కాస్తంత నవ్వరాదూ హాయిగా వుంటుంది.... అనేసి చిన్నతనంలో చీవాట్లు పెట్టినా పేరెంట్స్ తత్వం మారలేదు.

నాపెళ్లికి ముందు నుంచి నా శ్రీమతికి కామెడీ సినీమాలన్నా.... కామెడీ కథలు రాసి పత్రికలకు పంపటమన్నా భళే ఇష్టం! ఆ విషయం నాకు తెలీక దాని

మెల్లో తాళి కట్టి తప్పు చేశాను.

నా సీరియస్ నెస్‌కి ఆమెకు గల నవ్వే అలవాటుకి లంకె కుదరక కొట్టుకు చస్తున్నాం! నేను మందలించినా... తిట్టినా... నాలుగు పీకినా అది నవ్వటం ఆపదు. దానికది పుట్టుకతో వచ్చిన అలవాటేమోని సరిపెట్టుకోవటం నావల్ల కావటం లేదు.

అది నవ్వితే నన్ను పరిహసిస్తున్నదే ఫీలింగ్ నాకు. అదేకాదు... ఇంట్లో ఎవ్వరూ నా ముందు నవ్వ సాహసించరు. ఆవిషయంలో నేను స్ట్రిక్ట్!

టి.వీ. సీరియల్స్... ఇతర కామెడీ ప్రోగ్రామ్ వీక్షిస్తూ పొట్ట చెక్కలయ్యేట్టు పెద్దపెట్టున నవ్వుతుంది కింద.. నేల మీద పడి మరీ నవ్వుతూ పొల్లిగింతలు పెట్టటం నాకు అసలు నచ్చి చావదు.

కాలేజీలో చదివే రోజుల్లో ఫ్రెండ్సంతా తనను మీసాల పిల్లి' అని 'నిక్ నేమ్'తో పిలుస్తుండేవారని... అయినా అలాపిలవటం తన్లో కోపం పొంగిపొర్లేది కాదని... పకపకా నవ్వేదాన్నంటూ పెళ్లి అయిన ఏడాదిలో రోజుకు కనీసం వందసార్లై నాతో చెప్పి పడి పడీ నవ్వటం చూచి నాక కడుపులో తిప్పినట్టన్పిస్తూంటుంది.

శ్రీమతి నవ్వు చేష్టలు సహించలేకపోతున్నాను. 'అతిసర్వత్ర వర్జయేత్' అంటూ ఎన్నిసార్లు చెప్పినా విన్పించుకోదు.

అసలు.. ఆడదాని కడుపులో పుట్టెడు దుఃఖమున్నా నవ్వుతూ బతికేస్తుంది. మగాడు అలా కాదు కట్టుకున్న భార్యకాలం చేసినా కంటతడి పెట్టడు. ఇది మగాడి నైజం!.

ఎందుకే అట్లా వెర్రిదానిలా అన్నరోజు నాకు పస్తే! రెండు రోజులు ఇంట్లో పొయ్యిలో పిల్లి లేవదంతే! అది సీరియస్‌గా వుండటం నేనింతవరకు చూడలేదు.

అసలు నవ్వని ఆడవాళ్లుండరేమో అన్పిస్తుంది. ఈమధ్య కాలంలో హాస్యానికి డిమేండ్ పెరిగింది. హాస్య(కామెడీ) కథల పోటీలంటూ ఏటా నిర్వహించేస్తున్నారు పత్రికల వారు కామెడీకి సర్వే సర్వత్రా పెద్దపీట వేస్తున్నా నామటుక్కు నాకు అయిష్టతే!

ఆమధ్య నా శ్రీమతి రాసిన హాస్య కథకు పదివేల రూపాయల ప్రథమ బహుమతి ఇచ్చి పుణ్యం కట్టుకోవటం నేను హర్షించలేకపోయినా... ఆమెకు ఫాన్స్ పెరిగారు. అసంఖ్యాకంగా లెటర్సు... ఎస్.ఎం.ఎస్‌లు ఫోన్ కాల్స్‌తో నాకు తల

నొప్పి మొదలైంది చిరాకన్పించేంది.

ప్రైజొచ్చినందుకు చూశారా నా ఘనత అని మీసం(లేదుగాని) మేలేసింది (మెలేసినట్టు ఫోజు కొట్టింది) పొరపాటున ప్రైజొచ్చిన దాని కథ చదివిన నాకు నవ్వే రాలేదు. పైగ అలాంటి చెత్త కథ ఎందుకు రాసిందాని బావురమన్నాను.

తెలుగు సినీమా ఫీల్డు నిండా హాస్య నటులే! హీరో హీరోయిన్లు విలన్లు సైతం కామెడీ చేస్తున్నందుకు నామనసు విలవిలాడుతుంది.

నవ్వంటే నాపెళ్లానికి లవ్వెక్కువ! అంత లవ్వు నా పట్ల వుంటే మా సంసారం మూడు పువ్వులు ఆరు కాయలుగా వుండేది.

నేరకపోయి ఇద్దరం కలిసి ఓ బేవార్స్ తెలుగుసినిమా (అది వందరోజులు ఆడిందిలెండి) కెళ్లాం. వెళ్లింది మొదలు సినిమా చూస్తున్నంత సేపు నా బాధలు వర్ణనాతీతం! దాని పగలబడి నవ్వే తీరుకు వీక్షకులంతా మామూఖాలు చూస్తునే వున్నారు. దాని రాక్షస నవ్వుకి సినిమా హాలు దద్దరిల్లటంతో భూకంపం వచ్చిందేమోని థియేటర్ యాజమాన్యం అదిరిచచ్చింది.

శ్రీమతి నవ్వితే... ఆకాశం వురిమినట్టు... పిడుగులు పడ్డట్టు వుంటుంది. దాని నువ్వు దెబ్బకు ఎవ్వరూ తట్టుకోలేరు. ఏం గుర్తుకొస్తుందో ఏమో... అర్ధరాత్రి నిద్రలోకి లేచి పిచ్చిదానిలా నవ్వి మళ్లీ నిద్రకు ఉపక్రమిస్తుంది. స్లీప్ వాకర్ లాగ ఇది స్లీప్ లాఫరేమో?

దీనికి 'నవ్వు' మాయరోగం ఎప్పటికి తగ్గుతుందో?... అసలు తగ్గేనో లేదో? నే దిగులు పట్టుకుంది!

ఏడుపుగొట్టు సన్నివేశాలు టీ.వీలో చూస్తూ న్యూస్ రీడర్లాగానో... యాంకర్స్ లాగానో నవ్వుతూనే కార్యక్రమాలు వీక్షించటం నా శ్రీమతి ప్రత్యేకత!

నా కూతుళ్లిద్దరికీ తల్లి పోలికే వచ్చింది! తల్లి ప్రసవించినపుడు ఎవరైనా ప్లిలు ఏడుస్తారు... ఏడవకపోతే డాక్టరో... నర్సో పసివాళ్ల పిర్రమీద కొట్టి ఏడ్చేట్టు చేస్తారు... కానీ ఇద్దరు పిల్లలూ ఏడవకుండా నవ్వుతూ పుట్టారు అలా జరగటం చూచిన కాన్పుల వార్డ్లో ఆడంగులు విస్తుపోయి ముక్కున వేలేసుకున్నారు. నేనేమో అవాక్కయ్యాను.

ఇద్దరాడ పిల్లలూ ఏడుపు గొట్టు వాళ్లు కాదు. వాళ్లు నవ్వుల రాణులు!

ఆకలేసినా ఏడిచే ఘటాలు కాదు. తల్లి పాలుకలుపు కొచ్చేదాకా నోట్లో వేలేసుకుని చప్పరించటం వాళ్లకి అలవాటైంది.

× × × × ×

నేనెప్పుడైనా పిల్లలను కోప్పడినా నవ్వుతారే గాని అలగరు... ఏడుపులంకించుకోరు.

పెద్దయ్యాక 'డాడీ! సీరియస్‌గా వుండకండి... టెన్షన్ రావచ్చు! బి.పి. వస్తుంది. మీ ఆరోగ్యం చెడుతుంది...' సలహా ఇవ్వటం నాకు చిత్రంగ తోచేది.

'మీ డాడీకి అట్లా గడ్డి పెట్టండి. ఇన్నేళ్ల కాపురంలో నవ్వుతూ బతకమని చెప్పి చెప్పి నా నోరు పడిపోయింది...' శ్రీమతి మాటలకు చిర్రెత్తుకొచ్చేది నాకు.

పిల్లలిద్దరినీ చదివించి పెళ్లిళ్లు చేసి అత్తవారింటికి సల క్షణంగా పంపాం! కాపురానికెడుతున్నప్పుడు కుమార్తెల కళ్లల్లో నీరుగాని... మాటల్లో దిగులు గాని చూడలేకపోయాను. ఒకటే నవ్వు!

'ఎందుకు డాడీ ఏడవటం? హాయిగా అత్తవారింటికి వెళ్లిపోతున్నందుకు నవ్వాలి గాని...' అంటూ ఎదురు మాట్లాడటం చూచి ఆశ్చర్యపోయాను.

పిల్లలు వెళ్లిపోతుంటే నాకు మాత్రం దుఃఖం పొంగి పొర్లుకొచ్చింది.

' ఈ సమయంలో కూడా ఎందుకే నీ నవ్వు?' నలుగురు నిన్ను పిచ్చిదనుకుంటారు...' నొసలు చిట్లించాను కోపాన్ని ప్రదర్శిస్తూ. అన్నాను

'నవ్వటం మీకెలాగూ చేతకాదు. ఎప్పుడూ రోగిష్ఠి వాడిలా సీరియస్‌గా వుంటారు. మేమలా కాదు. నవ్వు ఆరోగ్యానికి 'టానిక్ అని తెల్సిన వాళ్లం! మా నవ్వుకు అడ్డు రాకండి.... ఆరోగ్యమే మహాభాగ్యం కదా... అది తెల్సింది ఒక్క ఆడవారికే! అందుకే మాకు సంపూర్ణ ఆయుర్దాయం! నిండు నూరేళ్లు బ్రతికేస్తూంటాం!

నా రెండోపిల్ల స్వాతి అచ్చంవాళ్లమ్మ పోలికే! దాని నోట్లోంచి వూడి పడింది. అన్నీ నా శ్రీమతి (అవ)లక్షణాలే పుణికి పుచ్చుకుంది! వాళ్లమ్మ లాగే అదీ అయిన దానికి కాని దానికీ నవ్వుతూంటుంది. ఆ నవ్వేదాని కాపురానికి ఎసరు పెట్టింది! దాని కొంపకొల్లేరైంది! బతుకు బస్టాండైంది!

అది ఒక అర్ధరాత్రి వచ్చి తలుపు తట్టింది భర్త వెంటలేకుండా ఒక్కతే వచ్చినందుకు నిర్ఘాంతపోయాము.

వాళ్లమ్మ మీద వాలిపోతూ 'నా నవ్వే నాసంసారాన్ని బండల పాలు చేసింది...' భోరుమంది స్వాతి.

స్వాతి లో దుఃఖాన్ని నేను మొదటి సారిగా చూచి చలించిపోయాను.

'ఏం జరిగింది స్వాతీ?-' నేనడిగాను

'కాస్త వివరంగా అర్థమయ్యేట్టు చెప్పవే...' వాళ్లమ్మ నిలదీసింది.

'భార్య అతిగా అన్నింటికి నవ్వుతుంటే.... ఓర్చుకుని సహనంతో కాపురం చేయటం అందరి మగాళ్లకి చేతకాదమ్మా... నా భర్త డాడీలా మంచివాడు కాదమ్మా...'

'ఉపమానాలు... ఉపమేయాలు చెప్పటం ఆపి... అసలు పాయింటుకి రావే...' విషయం బోధపడక రెట్టించి మాట్లాడాను.

'దాన్ని అనవసరంగ కోప్పడకండి! నిదానంగ తెల్లారేక అదే చెప్తుంది- స్వాతీ! ఓ గ్లాసు పాలు తాగేసి వెళ్లి రూమ్‌లో పడుకుని హాయిగా నిద్రపో...'

తల్లి కూతురుకి వత్తాసు రావటం చూచి ఏం మాట్లాడాలో అర్థం కాకపోవటంతో నానోరు పెగల్లేదు.

ఆ రాత్రంతా కంటిమీద నాకు కునుకే కరువైంది. కూతురు అర్ధరాత్రి పుట్టింటికెందుకొచ్చినట్టు? అల్లుడు మంచివాడే కదా!?... స్వాతిమీద చెయ్యి చేసుకున్నాడా? ఏమైవుంటుందో... ఏం జరిగివుంటుందో నా వూహకు అందలేదు.

తెల్లవారింది!

'మీ అత్త గారేమైనా అన్నారా? ప్రశ్నించాను కాఫీ తాగుతూ.

'అబ్బా... దాన్ని బెదరకొట్టకండి...' నా పెళ్లాం రంకెపెట్టి నన్ను నన్ను కట్టడి చేసింది.

నానోటికి తాళం పడినట్టయింది!

అయినా వుండబట్టలేక 'నీ మామ గారు ఇంట్లోంచి గెంటేశారా?- మళ్లీ అత్తారింటి గడపతొక్కదన్నారా?- అలాంటిదేదైనా వుంటే... వివరంగా చెప్పు... వాళ్లకెలాగో సర్దినచ్చచెప్తాను' మళ్లీ మాట్లాడాను.

ఏడవాల్సింది పోయి పగలబడి నవ్వింది స్వాతి. నాకు చిర్రెత్తుకొచ్చింది కూతురు నవ్వుతో శృతి కలిపింది శ్రీమతి.

'నాకు ప్రతిదానికి నవ్వటం అలవాటని నీకు తెల్సుగా డాడీ... నేను అయిన

దానికి కాని దానికి పగలబడి నవ్వటం వాళ్లెవ్వరికీ నచ్చలేదు. వాళ్లు నవ్వరు. నన్ను నవ్వనీయరు. నా మొగుడులు గానీ అత్తమామలు కాని నవ్వటమంటే ఏమిటో ఎరగని జంతువులు! నా నాన్‌స్టాప్ నవ్వు చూస్తూ వాళ్ల వళ్లు మండేది. అయినా నేను కేర్ చెయ్యలేదు. నా వంటి నవ్వే ఆడపిల్ల తనకు భార్యగా వద్దంటూ నా మొగుడు... కోడలు అలా నవ్వితే బ్రతుకు నవ్వులాట అవుతుందని అత్తమామలు నన్ను వేధించసాగారు - నేను నవ్వటం ఆపేదిలేదని తెగేసి చెప్పాను. ఇహ నన్ను నా నవ్వును భరించలేక సహించలేక నన్ను బైటికి నెట్టి... మళ్లీ గడపలోకి అడుగు పెట్టద్దంటూ దభీమని వీధి తలుపు మూసేసి గడియపెట్టుకున్నారు. జరిగింది అవమానమని నా కన్పించకపోవటంతో పుట్టింటికి పరుగెత్తు కొచ్చేశాను డాడీ...' జరిగింది క్లుప్తంగా వివరించిన స్వాతి విరగబడి నవ్వింది మళ్లీ.

దాని నవ్వు చూచినా కడుపులో 'దేవి' నట్టయింది. దుఃఖ ముంచుకొచ్చింది.

'నువ్ డోన్ట్‌వర్రీ స్వాతీ... నాలుగు రోజులు గడిస్తే పస్తులుండలేక నీ మొగుడు పరుగెత్తుకొస్తాడు. నిన్ను చెయ్యిపట్టుకుని లాక్కెడతాడు. మగాడి వీక్‌నెస్ అదేనే! ఏం చేసినా అదే మనకు ప్లస్ పాయింట్ అన్చెప్పిన శ్రీమతి వికటాట్టహాసం చేసింది. నన్నదరగొట్టేసింది.

నాకేడుపొచ్చినా తల్లీ కూతుళ్లు పగలబడి నవ్వుతూనే వున్నారు.

(సమాప్తం)